సాక్షి
యాదాద్రి భువనగిరి
దీపావళి శుభాకాంక్షలు
సోమవారం । 20 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

కేటీఆర్‌ను కలిసిన గొంగిడి దంపతులు



కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గొంగిడి మహేందర్‌రెడ్డి, సునీత

యాదగిరిగుట్ట : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, బీఆర్‌ఎస్ రైతు విభాగంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. తమ కుమార్తె వివాహానికి హాజరుకావాలని ఆహ్వానించారు.ఆలేరు నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై గొంగిడి దంపతులతో కేటీఆర్ చర్చించారు. అనంతరం మాజీ మంత్రులు హరీష్‌రావు, కుందూరు జానారెడ్డిని కలిసి పెళ్లి పత్రిక అందజేశారు.

నకిలీ మందుల సమాచారమివ్వండి

భువనగిరిటౌన్ : ప్రజారోగ్యానికి పెనుముప్పుగా మారిన నకిలీ డ్రగ్స్‌పై సమాచారం ఇవ్వాలని ఔషధ తనిఖీ జిల్లా అధికారి ఏలె బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.నకిలీ మందులు వ్యాధిని నయం చేయకపోవడమే కాకుండా ఆరోగ్యంపై దుష్ప్రరిణామాలు సృష్టిస్తాయన్నారు. మత్తు కలిగించే నార్కోటిక్ సంబంధిత ఔషధాల తయారీ, వినియోగం, ఇతర నిషేధిత మందుల అమ్మకాలు, నాణ్యత సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 18005996969 ద్వారా తెలియజేయాలని పేర్కొన్నారు. సమాచారమిచ్చిన వ్యక్తులు వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు



ఆలయ ముఖమండపంలో ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు గావించారు. రాత్రికి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

వెలుగుల వేడుకకు వేళాయే

• నేడు దీపావళి • నోములు, వ్రతాలకు సిద్ధం • కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిట

భువనగిరి: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక, చీకటిని పారదోలి జీవితాల్లో వెలుగులు నింపే పండుగ దీపావళి. సోమవారం పండుగను ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. లక్ష్మీ పూజలు, నోములు, వ్రతాలకు ఏర్పాట్లు చేసుకున్నారు. భువనగిరి, చౌటుప్పల్, ఆలేరు, పోచంపల్లి, యాదగిరిగుట్ట, మోత్కూరు పట్టణాల్లో పూలు, టపాసులు, పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్‌లు కిటకిటలాడాయి. రోడ్లకు ఇరువైపులా ప్రమిదల విక్రయ కేంద్రాలు వెలిశాయి. డిజైన్‌ను బట్టి రూ.50 నుంచి రూ.200 వరకు విక్రయించారు. బంతిపూలు కిలో రూ.50నుంచి రూ.80 వరకు ధర పలికాయి.

పేలిన టపాసుల రేట్లు

దీపావళి అంటేనే టపాసుల ప్రత్యేకం. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు టపాసులు కాల్చి ఆనందంగా గడుపుతారు. అయితే ఈసారి టపాసులు కాల్చకుండానే వాటి ధరలు పేలుతున్నాయి. టపాసులపై జీఎస్టీ ఎత్తివేయడంతో ధరలు తగ్గాయనుకున్న జనానికి ధరలు హడలిపోతున్నారు.



భువనగిరిలోని మానుకుంట వద్ద కొనుగోలుదారులతో కిక్కిరిసిన టపాసుల దుకాణం



భువనగిరిలోని ఓ షాప్‌లో టపాసులు



భువనగిరిలో విక్రయానికి ఉంచిన బంతిపూలు



ప్రమిదలను కొనుగోలు చేస్తున్న మహిళలు

కూరెళ్లలో కోతుల బెడద ఉండదిక

- వానరాలను పట్టి తరలించేందుకు కరీంనగర్ నుంచి వచ్చిన టీంలు
- ఒక కోతికి రూ.300 చొప్పున చెల్లింపు
- ఇంటికి రూ.వెయ్యి చొప్పున ఇచ్చేందుకు ముందుకొచ్చిన గ్రామస్తులు



పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బోను

ఆత్మకూరు(ఎం): ఆ గ్రామంపై నిత్యం కోతులు దండయాత్ర చేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి కనపడ్డ వస్తువునల్లా ఛిద్రం చేస్తున్నాయి. ఆహారపదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. పెంకుటిళ్లను పీకి పందిరేస్తున్నాయి. దారిన వెళ్లేవారిని గాయపరుస్తున్నాయి. ఇకనుంచి అటువంటి పరిస్థితి ఉండదు. ఆత్మకూరు(ఎం) మండలం కూరెళ్ల గ్రామ పంచాయతీలో సుమారు 2 వేల జనాభా ఉంది. గ్రామస్తులు పదేళ్లుగా కోతులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. చివరకు గ్రామస్తులంతా మూకుమ్మడి నిర్ణయం తీసుకున్నారు. కరీంనగర్ నంచి ప్రత్యేక టీంలను రప్పించారు. పట్టి తరలించినందుకు ఒక్కో వానరానికి రూ.300 చొప్పున ఒప్పందం కుదుర్చుకున్నారు. గ్రామంలో 500 ఇళ్లు ఉండగా.. ఇంటికి రూ.1000 చొప్పున ఇవ్వడానికి ముందుకు వచ్చారు.

వానరాల పట్టివేతకు శ్రీకారం

కరీంనగర్ నుంచి వచ్చిన ప్రత్యేక టీంలు ఆదివారం పాఠశాల ఆవరణలో బోన్లు ఏర్పాటు చేశారు. మొదటి రోజు 20 వరకు వానరాలను బంధించారు. కోతులన్నింటినీ పట్టిన సురక్షితంగా అడవుల్లో వదిలిపెట్టనున్నట్లు బృందం సభ్యులు తెలిపారు.

పదేళ్ల సమస్యకు విముక్తి కలగనుంది



దాదాపు పదేళ్లుగా కోతులు గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కోతుల వల్ల జరిగిన నష్టం అంతాఇంతా కాదు. పలువురు గాయపడిన సందర్భాలు ఉన్నాయి. ఇంటికి వెయ్యి రూపాయల చొప్పున వేసుకొని కోతులను పట్టిస్తున్నాం. గ్రామస్తులంతా సహకరిస్తున్నారు. – బాషబోయిన ఉప్పలయ్య యాదవ్, కూరెళ్ల మాజీ సర్పంచ్

అభిప్రాయాలను స్వేచ్ఛగా తెలియజేయండి

- ఏఐసీసీ పరిశీలకుడు శరత్‌రౌత్

భువనగిరిటౌన్ : జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపిక అన్ని వర్గాల అభీష్టం మేరకే జరుగుతుందని, పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఏఐసీసీ పరిశీలకుడు శరత్‌రౌత్, టీపీసీసీ పరిశీలకుడు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పేర్కొఅన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన భువనగిరి నియోజకవర్గ స్థాయి సమావేశంలో కార్యకర్తలు, నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ చేయడంతో పాటు, ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో భద్రత కొరవడిందన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.



డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకుంటున్న పీసీసీ సభ్యుడు తంగళ్లపల్లి రవికుమార్

కాగా డీసీసీ అధ్యక్ష పదవికి తంగళ్లపల్లి రవికుమార్, బర్రె జహంగీర్ దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు నీలం పద్మ, నాయకులు పోత్నక్ ప్రమోద్‌కుమార్, తడక వెంకటేశం, పంజాల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కిక్కులేని మద్యం టెండర్లు



భారీగా తగ్గిన దరఖాస్తులు

- తప్పిన ఎక్సైజ్ శాఖ అంచనాలు
- దరఖాస్తులు పెంచేలా ప్రయత్నం
- 23వ తేదీ వరకు గడువు పెంపు

సాక్షి, యాదాద్రి: ప్రభుత్వం మద్యం టెండర్ల దరఖాస్తు గడువు పెంచిన నేపథ్యంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే పనిలో జిల్లా ఎక్సైజ్ శాఖ నిమగ్నమైంది. ఈనెల 23 వరకు గడువు ఉండటంతో మరిన్ని దరఖాస్తులను రాబట్టే పనిలో ఉంది. ఈ క్రమంలో తక్కువ దరఖాస్తులు వచ్చిన వైన్స్‌లపై దృష్టి సారించింది. అందుకు కారణాలను విశ్లేషిస్తోంది.

ఆదాయం పెరిగినా అంచనాలను చేరలేదు

2025–27 రెండు సంవత్సరాల కాలానికి గాను ప్రభుత్వం నూతన మద్యం టెండర్లు పిలిచింది. దరఖాస్తు గడువు ఈనెల 18న ముగిసింది. 2023లో నాన్ రిఫండబుల్ ఫీజు రూ.2 లక్షలు ఉండగా 3,969 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.79.38 కోట్ల ఆదాయం సమకూరింది. ఈసారి దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలకు పెంచింది. 2,674 దరఖాస్తులు రాగా.. రూ.79.41 కోట్ల రాబడి వచ్చింది. ఆదాయపరంగా చూస్తే గతంలో కంటే రూ.3 లక్షలు పెరిగింది. కానీ, ప్రభుత్వ అంచనాలను చేరలేదని తెలుస్తోంది.

వ్యాపారుల సిండికేట్ ప్రభావం

ప్రస్తుతం వైన్స్‌లు నిర్వహిస్తున్న వ్యాపారుల్లో కొందరు మళ్లీ వాటినే దక్కించుకునేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. సిండికేట్‌గా ఏర్పడి చక్రం తిప్పారని, గతంతో పోలిస్తే 1,322 దరఖాస్తులు తగ్గాయని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. రానున్న స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్, సహకార ఎన్నికల నేపథ్యంలో కొత్తవారికి అవకాశం లేకుండా వ్యూహాత్మకంగా దరఖాస్తులు వేశారని తెలుస్తోంది.

ఆలేరు సర్కిల్‌లో కనిపించని స్పందన

జిల్లాలో భువగగిరి, రామన్నపేట, మోత్కూరు, ఆలేరు ఎక్సైజ్ సర్కిళ్లు ఉన్నాయి. ఇందులో ఆలేరు సర్కిల్‌లో తక్కువ దరఖాస్తులు వచ్చాయి. చాడలో రెండు, మోటకొండూరు, బొందుగుల, రుస్తాపూర్, రాజాపేట, తుర్కపల్లిలోని వైన్స్‌లకు 20 లోపే దరఖాస్తులు వచ్చాయి. రుస్తాపూర్‌లో 14, మోటకొండూరులో 15, చాడ షాప్ –1లో 16 దరఖాస్తులు అందాయి. ఇక్కడ మరిన్ని దరఖాస్తులు వచ్చేలా ఎక్సైజ్ అధికారులు చర్యలు ప్రారంభించారు. టెండర్లు వేయాలని మద్యం వ్యాపారులను ప్రోత్సహిస్తున్నారు. మిగతా చోట్ల కూడా టెండర్ల పెంపునకు ప్రయత్నిస్తున్నారు.

ఎల్లంబావి వైన్స్‌కు అధికంగా..

గతంలో మాదిరిగానే ఈసారి కూడా చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామ వైన్స్‌కు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. జనరల్ కేటగిరీలో ఉన్న ఈ వైన్స్‌కు 88 దరఖాస్తులు వచ్చాయి. ఆ తరువాత వలిగొండ మండలం అర్రూరు వైన్స్‌కు 80, బీబీనగర్ మండలం భట్టుగూడెం 74, భువనగిరి మండలం అనాజీపురం మద్యం షాప్‌కు 64 దరఖాస్తులు దాఖలయ్యాయి.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పూర్ణచందర్‌రాజు



ఆత్మకూరు(ఎం): తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆత్మకూరు(ఎం)కు చెందిన మాజీ జెడ్పీటీసీ పూర్ణచందర్ రాజు ఎంపికయ్యారు. ఆయనను పర్కాల నర్స య్య, జెట్ట యాదగిరి, సుల్తాన్ పురుషోత్తం, యాస పద్మారెడ్డి, మాద నర్సయ్య, జె.ప్రభాకర్ అభినందించారు.

అభివృద్ధికి దారి లేదా!

విస్తరణకు నోచని ఆలేరు–కాటేపల్లి రహదారి

- డబుల్ లేన్ చేస్తేనే మోటకొండూరు అభివృద్ధి
- వరంగల్–నల్లగొండ వెళ్లే వాహనాలకు తగ్గనున్న దూరం



ఆలేరు - కాటేపల్లి మార్గంలో పూర్తిగా ధ్వంసమైన బీటీ రోడ్డు

మోటకొండూర్: పునర్విభజనలో భాగంగా ఏర్పడిన మోటకొండూరు మండల అభివృద్ధికి తొమ్మిదేళ్లయినా బాటలు పడటం లేదు. మండల కేంద్రానికి సరైన రోడ్డు లేకపోవడంతో రవాణా సౌకర్యం మెరుగుపడటం లేదు. హ్యామ్‌లో భాగంగా జిల్లాలో 129.9 కిలో మీటర్ల మేర రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా అందులో మోటకొండూరు మండలానికి చోటు దక్కలేదు.

డబుల్ లేన్ వస్తే తగ్గనున్న దూరాభారం

వరంగల్–నల్లగొండ మార్గంలో నిత్యం వేలాదిగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆలేరు నుంచి వయా భువనగిరి మీదుగా వలిగొండ చేరుకోవటానికి 46 కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఆలేరు నుంచి మోటకొండూర్ మీదుగా వలిగొండకు కేవలం 34 కిలో మీటర్ల దూరం వస్తుంది. కాటేపల్లి నుంచి మోటకొండూర్ మీదుగా ఆలేరు వరకు 15 కి.మీ దూరం ఉన్న బీటీ రోడ్డును డబుల్ లేన్‌గా మారిస్తే ఇటుగా వెళ్లే వాహనాలకు 12 కి.మీ దూరం తగ్గటంతో పాటు సమయం ఆదా అవుతుంది.

ఈ గ్రామాలకు ప్రయోజనం

ఆలేరు–కాటేపల్లి రోడ్డును డబుల్ లేనుగా చేయడం వల్ల ఆలేరు బైపాస్ నుంచి బహుదూర్‌పేట్, మంతపురి, దిలావర్‌పూర్, మోటకొండూర్, సికింద్రనగర్, కాటేపల్లి మార్గంలో పలు గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. మోటకొండూర్ నుంచి భువనగిరి డబుల్ రోడ్డు సదుపాయం కల్పిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చింది. మోటకొండూర్ నుంచి చీమలకొండూర్ మీదుగా భువనగిరికి డబుల్ రోడ్డు పడుతుందని మండల వాసులు ఎదురుచూశారు. కానీ, ఇప్పటి వరకు అడుగుపడలేదు. మోటకొండూర్ మండల అభివృద్ధికి దోహదపడే రహదారులన్నింటినీ అప్‌గ్రేడ్ చేయాలని, పునర్విభజన హామీలను అమలు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డబుల్ రోడ్డుతోనే అభివృద్ధి



సరైన రవాణా వ్యవస్థ లేక మోటకొండూర్ మండలం అభివృద్ధి జరగడం లేదు. మండల కేంద్రానికి వెళ్లడానికి సౌకర్యాలు లేవు. ఆలేరు–కాటేపల్లి వరకు వయా మోటకొండూర్ మీదుగా ఉన్న బీటీ రోడ్డును డబుల్ రోడ్డుగా మారిస్తే ఎంతో మేలు జరుగుతుంది.

– పన్నాల చంద్రశేఖర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు

ఎమ్మెల్యే, మంత్రికి విన్నవించాం



ఆలేరు–కాటేపల్లి రోడ్డును రెండు వరుసలు చేయాలని స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి విన్నవించాం. జీపీ రోడ్డుగా ఉన్నందున, ఆర్‌అండ్‌బీ రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలని తెలిపారు. రోడ్డును ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేస్తుందన్న ఆశాభావంతో ఉన్నాం.

– పాండురంగయ్య గౌడ్, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్

నేడే దీపావళి పండుగ


వేణుగోపాల రావు

రామగిరి(నల్లగొండ): దీపావళి పండుగను సోమవారమే జరుపుకోవాలని నిర్ణయించినట్లు అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20న నరకచతుర్థశి నివాళులు, 21న ధనలక్ష్మి పూజలు జరుపుకోవాలని ఆయన అన్నారు. అమావాస్య ఘడియలు సోమవారం మధ్యాహ్నం 3.46 నుంచి మంగళవారం సాయంత్రం 5.56 నిమిషాల వరకు ఉన్నందున నోములు సోమవారం, మంగళవారం రెండు రోజులు జరుపుకోవచ్చని సూచించారు. ఈసారి కొత్త నోములు లేవని పాత వారు కేదారిశ్వరి వ్రతం చేసుకోవాలన్నారు. సోమవారం నివాళులు ఇచ్చుకోవాలని పేర్కొన్నారు.

సాగర్‌లో ముగిసిన ఏపీ గవర్నర్ పర్యటన

నాగార్జునసాగర్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రెండు రోజుల నాగార్జునసాగర్ పర్యటన ఆదివారం ముగిసింది. శనివారం కుటుంబ సమేతంగా నాగార్జునసాగర్‌కు వచ్చిన ఏపీ గవర్నర్ నాగార్జున కొండ మ్యూజియాన్ని సందర్శించి.. రాత్రి విజయ విహార్ అతిథి గృహంలో బస చేశారు. ఆదివారం నాగార్జునసాగర్ ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని, డ్యాం, బుద్ధవనం సందర్శించారు. అనంతరం ఆయన ప్రత్యేక హెలికాప్టర్‌లో తిరిగి ఏపీకి వెళ్లిపోయారు. ఆయనకు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వీడ్కోలు పలికారు. అంతకుముందు టూరిజం, రెవెన్యూ అధికారులతో ఫొటోలు దిగి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎస్పీ రాజశేఖరరాజు, తహసీల్దార్లు శాంతిలాల్, అనిల్‌కుమార్, రఘు, కృష్ణయ్య, డ్యాం ఎస్ఈ మల్లికార్జునరావు, ఈఈ సీతారాం, జిల్లా టూరిజం అధికారి శివాజీ, భానుప్రసాద్, కృష్ణకుమారి, రవి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

భువనగిరి: భువనగిరి మండలం రాయగిరి గ్రామ పరిధిలోగల మినీ శిల్పారామంలో ఆదివారం శ్రీచంద్ర కళా నిలయం ఆధ్వర్యంలో పెరుమాండ్ల షంతోష్ శిష్య బృందం ఆంధ్ర నాట్య కళా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెలవు దినం కావడంతో శిల్పారామానికి వచ్చిన సందర్శకులు నృత్య ప్రదర్శనను తిలకించి ఆనందించారు. ఈ నృత్య ప్రదర్శనలో కళాకారులు వర్షిక, సుహాని, రితిక, నిత్యశ్రీ, అశ్రిత, దీక్షిత, అక్షిత పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

తెల్లారితే కేఫ్ ఓపెనింగ్.. అంతలోనే అనంతలోకాలకు..

- వాటర్ ట్యాంక్ కూలి తల్లి, కుమారుడు మృతి
- మాడుగులపల్లి మండల కేంద్రంలో విషాదఛాయలు


భార్య నాగమణి, కుమారుడు విరాట్ కృష్ణ మృతదేహాల వద్ద రోదిస్తున్న తగుళ్ల వెంకన్న

మాడుగులపల్లి: తెల్లారితే కేఫ్ ఓపెనింగ్.. అందుకోసం కేఫ్ నిర్వాహకుడు తన కుటుంబ సభ్యులతో కలిసి ఒక రోజు ముందుగాను కేఫ్ వద్దకు చేరుకుని ఏర్పాట్లు చేసుకుని రాత్రి అక్కడే నిద్రించారు. తెల్లవారుజామున కేఫ్ పైకప్పుపై ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ కూలి కేఫ్ నిర్వాహకుడి భార్య, కుమారుడు మృతిచెందారు. ఈ ఘటన చిట్యాల మండల పరిధిలోని పెద్దకాపర్తి శివారులో జరగగా.. మృతుల స్వస్థలం మాడుగులపల్లి మండల కేంద్రం కావడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలు.. మాడుగులపల్లి మండల కేంద్రానికి చెందిన తగుళ్ల వెంకన్న, నాగమణి(30) దంపతులకు కుమారుడు విరాట్ కృష్ణ(7), కుమార్తె నందిని సంతానం. వెంకన్న రైల్వే శాఖలో గ్యాంగ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. వీరు ఆర్థికంగా ఉన్నతంగా బతకాలన్న ఉద్దేశంతో చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన నూతనంగా కేఫ్ ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం కేఫ్ ప్రారంభించాలని అనుకుని శనివారం రాత్రి కుటుంబ సభ్యులందరూ కలిసి కేఫ్ వద్దకు వెళ్లి రాత్రి అక్కడే నిద్రించారు. ఆదివారం తెల్లవారుజామున వెంకన్న నిద్రలేచి పనులు చేసుకుంటున్నాడు. అదే సమయంలో కేఫ్ రేకుల పైన ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్యాంక్ అక్కడే నిద్రిస్తున్న వెంకన్న కుటుంబ సభ్యులపై పడిపోయింది. వెంకన్న వెంటనే వారిని ఆస్పత్రికి తరలించగా అతడి భార్య నాగమణి(30), కుమారుడు విరాట్ కృష్ణ(7) అప్పటికే మృతిచెందారు. అతడి కుమార్తె కూతురు నందిని, తల్లి పార్వతమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. పార్వతమ్మను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన నాగమణి, విరాట్ కృష్ణకు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గ్రామానికి చేరుకున్న మృతదేహాలను స్థానికులు సందర్శించి కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం నాగమణి, విరాట్ కృష్ణ మృతదేహాలకు మాడుగులపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.

నేత్రదానం..

నాగమణి, విరాట్ కృష్ణ నేత్రాలను దానం చేసేందుకు గాను ఐ డొనేషన్ సెంటర్ వారు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ సభ్యులను అవగాహన కల్పించగా.. వారు ఒప్పుకున్నారు. దీంతో నాగమణి, విరాట్ కృష్ణ కంటి కార్నియాను టెక్నీషియన్ బచ్చల కూరి జాని సేకరించారు.

దీపావళి వెలుగులు నింపాలి

- శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ: నల్లగొండ జిల్లా ప్రజలకు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి పండుగ ప్రతిఒక్కరి జీవితంలో వెలుగును నింపాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలంతా దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

అప్రమత్తంగా ఉంటేనే ఆనంద కేళి..

- టపాసులు కాల్చేటప్పుడు సరైన జాగ్రత్తలు పాటించాలి



పెద్దవూర: వెలుగులు విరజిమ్మే దీపావళి రానే వచ్చింది. పండుగ రోజున టపాసులు పేల్చేవారు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆనందకేళీ అవుతుంది.

వ్యాపారులు పాటించాల్సిన జాగ్రత్తలు

- టపాసుల దుకాణదారులు అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి.
- దుకాణాలను బహిరంగ మైదానాలు, అధికారులు సూచించిన స్థలాల్లోనే ఉండాలి.
- దుకాణాల వద్ద ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రమాదాల నివారణకు నీటిని, ఇసుకను అందుబాటులో ఉంచుకోవాలి.
- వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి దుకాణదారుడు కరపత్రాలను అందజేయాలి.
- దుకాణానికి అనుమతి గడువు తీరిన అనంతరం టపాసులను సంబంధిత అధికారికి అప్పగించాలి.

కాల్చేటప్పుడు జాగ్రత్తలు

- అనుమతులు ఉన్న దుకాణాల్లోనే టపాసులను కొనుగోలు చేయాలి.
- పెద్దల సమక్షంలోనే చిన్న పిల్లల చేత పటాకులు కాల్పించాలి.
- టపాసులు కాల్చేటప్పుడు తప్పనిసరిగా నీళ్లు, ఇసుకను అందుబాటులో ఉంచుకోవాలి.
- టపాసులు కాల్చే సమయంలో బిగుతుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.
- పొరపాటున దుస్తులకు నిప్పు అంటుకుంటే అటూ ఇటూ పరిగెత్తకుండా ఉన్న చోటే కింద పడుకుని దొర్లాలి. అలా చేయడం వలన నిప్పు త్వరగా ఆరిపోతుంది.
- ఇంట్లో కిరోసిన్, గ్యాస్ సిలిండర్ల వద్ద టపాసులను నిల్వ ఉంచకూడదు.
- సగం కాలిన టపాసులను మళ్లీ కాల్చే ప్రయత్నం చేయరాదు.
- బాణసంచా కాల్చిన తర్వాత సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.
- టపాసులను సొంతంగా తయారు చేసే ప్రయత్నం చేయరాదు.
- బాణసంచా పేలుళ్ల వలన వినికిడి సమస్యతో పాటు అధిక రక్త పోటు, గుండెపోటుకు గురయ్యే ప్రమాదం ఉంది.

రసాయనాలు.. వాటి ప్రభావం..

చైనా టపాసుల్లో పొటాషియం క్లోరైడ్‌ను ఎక్కువగా వినియోగిస్తారు. వీటిని పేల్చగానే ఒకేసారి పొగ ఊపిరితిత్తుల్లోకి వెళ్లి మనిషిని అనారోగ్యం పాలు చేస్తుంది. టపాసుల్లో ఉపయోగించే రసాయనాలు పీల్చడం వలన కలిగే దుష్ఫలితాలు..

రాగి: శ్వాస నాళాల్లో మంట వస్తుంది.
కాడ్మియం: రక్తహీనత, మూత్రపిండాలు దెబ్బతింటాయి
సీసం: నాడీ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది
మెగ్నీషియం: మెగ్నీషియం ధూళి కారణంగా జ్వరం వస్తుంది.
సోడియం: చర్మవ్యాధులు వస్తాయి
జింక్: వాంతులు వస్తాయి
నైట్రేట్: మానసిక స్థితి అదుపు తప్పుతుంది.

చిన్నపిల్లలు, గర్భిణులు దూరంగా ఉండాలి



టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లల దగ్గర ఉండాలి. పెద్దపెద్ద శబ్దాలు వచ్చే బాంబులను కాల్చకపోవడమే మంచిది. సాధారణంగా మన చెవులు 50 డెసిబుల్ శబ్దాలను మాత్రమే తట్టుకుంటాయి. బాణసంచా పేల్చుడు వలన 70 డెసిబుల్స్ దాటితే చిన్న పిల్లలకే కాదు పెద్దలకు కూడా చెవుడు వచ్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు టపాసులకు దూరంగా ఉండటమే మంచిది.

– డాక్టర్ నగేష్, మండల వైద్యాధికారి, పెద్దవూర

అసమానతలు లేని సమాజం కోసం ఉద్యమించాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం


మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

రామన్నపేట: అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం యువత ఉద్యమించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఆదివారం రామన్నపేటలో నిర్వహించిన యువ కమ్యూనిస్టుల సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యువకులతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దేశంలో పెట్టుబడిదారీ విధానం వల్ల అసమానతలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ ప్రపంచంలో కమ్యూనిజం మహోన్నతమైన సిద్ధాంతమని, కమ్యూనిస్టులు పురోగామిశక్తులు అని చెప్పడానికి శ్రీలంక వంటి పరిణామాలే నిదర్శనమని వివరించారు. పార్టీలు రాజకీయ లబ్ధి కోసం ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటి అమలు కోసం ప్రజలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఉచిత విద్య, వైద్య అందించినప్పుడే దేశం అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ మాట్లాడుతూ.. యువత దోపిడి వ్యవస్థను నిలువరించాలని, మతోన్మాదశక్తులను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల కార్యదర్శి జెల్లెల పెంటయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో నాయకులు మేక అశోక్‌రెడ్డి, జెల్లెల పెంటయ్య, గడ్డం వెంకటేశం, బల్గూరి అంజయ్య, వనం ఉపేందర్, కూరెళ్ల నర్సింహాచారి, బోయిని ఆనంద్, కందుల హన్మంత్, కల్లూరి నాగేష్, గొరిగె సోములు, నాగటి ఉపేందర్, విజయ్‌భాస్కర్, మీర్‌ఖాజా, బాలరాజు, రామచంద్రం, శ్రవన్, శివ, ఉదయ్ పాల్గొన్నారు.

కాలం చెల్లిన ఇంజెక్షన్ ఇచ్చిన సిబ్బంది సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ హనుమంతరావు

తుర్కపల్లి: తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగికి కాలం చెల్లిన ఇంజెక్షన్ ఇచ్చిన సిబ్బందిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామానికి చెందిన తోలిచుక్క అంజయ్య కాలికి గాయం కావడంతో శనివారం చికిత్స నిమిత్తం పీహెచ్‌సీకి వచ్చాడు. అతడికి పీహెచ్‌సీ సిబ్బంది కాలం చెల్లిన యాంటిబయాటిక్ ఇంజెక్షన్ ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఘటనపై వైద్యాధికారులు విచారణ చేపట్టగా.. ఫార్మసిస్టు మహేశ్వరి ఇంజెక్షన్ పరిశీలించకుండానే ఇవ్వగా.. స్టాఫ్ నర్సు రజిత గమనించకుండానే రోగికి ఇంజెక్షన్ ఇచ్చినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో స్టాఫ్ నర్సు రజిత(కాంట్రాక్ట్), ఫార్మసిస్ట్ మహేశ్వరి(అవుట్ సోర్సింగ్)ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించబోమని కలెక్టర్ హనుమంతరావు స్పష్టం చేశారు. వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆయన సూచించారు.

అక్రమంగా తరలిస్తున్న 78 పశువుల పట్టివేత

మర్రిగూడ : డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న 78 ఆవులను ఆదివారం తెల్లవారుజామున మర్రిగూడ పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండల పరిధిలోని గరికెనట్‌తండా నుంచి మర్రిగూడ మండలం కొండూరు, అజ్జిలాపురం గ్రామాల మీదుగా హైదరాబాద్ నగరంలోని కబేళాకు పశువులను తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు అజ్జిలాపురం గ్రామం వద్ద పోలీసులు వాహనాన్ని పట్టుకున్నారు. ఆవులను తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి పట్టుబడిన పశువులను సంరక్షణ నిమిత్తం శంషాబాద్‌లోని ముచ్చింతల్ గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సూక్ష్మ సైజులో అమరవీరుల స్థూపం


శ్రీనివాసచారి

భువనగిరి: భువనగిరి పట్టణానికి చెందిన స్వర్ణకారుడు చోల్లేటి శ్రీనివాసచారి ఈ నెల 21న పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సూక్ష్మ సైజులో పోలీసు అమరవీరుల స్థూపాన్ని తయారు చేశారు. 40 గ్రాముల వెండితో నాలుగు ఇంచుల ఎత్తులో రూపొందించి ఔరా అనిపించారు. ఆయన గతంలోనూ బంగారం, వెండితో వీసా టవర్, క్రికెట్ స్టేడియం, క్రికెట్ వరల్డ్ కప్, భారత పార్లమెంటు భవనం, వీణ, బంగారు బతుకమ్మ, తెలంగాణ చిత్రపటం, ఫుట్‌బాల్ వరల్డ్ కప్, క్రికెట్ బాల్ వంటివి తయారు చేశాడు.

వెండితో తయారు చేసిన పోలీసు అమరవీరుల స్థూపం →



22 నుంచి కార్తీక పూజలు

- యాదగిరి క్షేత్రంలో ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- వ్రత మండపంలో పీటలు, ప్రసాదాలు రెడీ


వ్రత మండపంలో సిద్ధం చేస్తున్న వ్రత పీటలు

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి నవంబర్ 20వ తేదీ వరకు కార్తీక మాసం ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణాతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు అధికంగా యాదగిరి క్షేత్రంలో ఈ కార్తీక మాసంలో శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు జరిపించేందుకు ఆసక్తి కనబరుస్తారు. వ్రత పూజల్లో పాల్గొనేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొండ దిగువన ఉన్న సత్యనారాయణస్వామి వ్రత మండపంలోని రెండు హాల్స్‌లో పూజ సామాగ్రి, వ్రత పీటలను, వ్రతంలో ఉపయోగించే ప్రసాదాలను ప్యాకింగ్ చేసి సిద్ధం చేశారు. యాదగిరి ఆలయానికి అనుబంధంగా ఉన్న పాతగుట్టలో సైతం భక్తులు వ్రతాలను జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు.

యాదగిరి క్షేత్రంలో..


యాదగిరి క్షేత్రంలో నెల రోజుల పాటు 6 బ్యాచ్‌లుగా వ్రతాలను నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మొదటి బ్యాచ్ ఉదయం 7గంటల నుంచి 8గంటల వరకు, రెండో బ్యాచ్ ఉదయం 9గంటల నుంచి 10 గంటల వరకు, మూడో బ్యాచ్ 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, నాల్గవ బ్యాచ్ మధ్యాహ్నం 1గంటల నుంచి 2గంటల వరకు, ఐదో బ్యాచ్ మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు, ఆరో బ్యాచ్ సాయంత్రం 5గంటల నుంచి 6గంటల వరకు నిర్వహించనున్నారు.

పాతగుట్ట ఆలయంలో..

యాదగిరీశుడి అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో నాలుగు బ్యాచ్‌లుగా వ్రతాలు నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు. మొదటి బ్యాచ్ ఉదయం 9గంటలకు, రెండో బ్యాచ్ 11గంటలకు, మూడో బ్యాచ్ మధ్యాహ్నం 2గంటలకు, నాల్గవ బ్యాచ్ సాయంత్రం 4గంటలకు నిర్వహిస్తారు.

కార్తీక పౌర్ణమి రోజు..

వచ్చే నెల 5వ తేదీన కార్తీక శుద్ధ పూర్ణిమ నేపథ్యంలో యాదగిరి కొండకు దిగువన ఉన్న సత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఉదయం 5గంటల నుంచి రాత్రి 7గంటల వరకు 8 బ్యాచ్‌లుగా వ్రతాలు నిర్వహించనున్నారు. ప్రతి గంటకు ఒక్క బ్యాచ్ చొప్పున 8 బ్యాచ్‌లు నిర్వహిస్తామని ఇప్పటికే ఆలయ ఈఓ రవినాయక్ వెల్లడించారు. కాగా పాతగుట్ట ఆలయంలో 6 బ్యాచ్‌లుగా వ్రతాలను భక్తులచే జరిపిస్తారు.



విద్యుద్దీపాల వెలుగుల్లో బుద్ధవనం

నాగార్జునసాగర్: దీపావళి పండుగ సందర్భంగా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. విద్యుత్ దీపాల వెలుగుల్లో బుద్ధవనం పర్యాటకులను ఆకట్టుకుంటోంది.